# కన్నీరు... మున్నీరు...!

మా 'గజిబిజి' మాసపత్రికకు నేటితో నూరేళ్ళు నిండినయ్!... సారీ!... ప్రారంభించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంది! నూరు వసంతాలు దాటినయ్! పాతిక లక్షల కాపీల సర్క్యులేషన్ చేరుకుంది. నిరక్షరాస్యులు సైతం 'సర్వశిక్ష అభియాన్'లో చదువు నేర్చుకుని మరీ మా పత్రికను ఎగబడి కొని అక్షరం విడిచిపెట్టకుండ ఆమూలాగ్రం చదువుతున్నారనే విషయం మమ్మెంతో ఆనంద పరుస్తోంది. పాఠక దేవుళ్లకు పత్రిక యాజమాన్యం సర్వవేళ సర్వావస్థలయందూ ఋణపడి వుంటుందని మనవి చేసుకుంటున్నాం.

మా మాసపత్రిక నూరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకుని శత జయంతి వుత్సవాలను నిర్వహిస్తూ వినూత్న పద్ధతిలో కథలపోటీ నిర్వహించ దలచాము.

వినూత్న విచిత్రమైన మా కథల పోటీకి 'ఏడుపుగొట్టు' అనే టైటిల్ థ్రిల్లింగ్‌గా వుండగలదని భావిస్తున్నాం.

మేము నిర్వహిస్తున్న 'ఏడుపుగొట్టు' కథల పోటీకి... ఆడ మగ... పిల్ల జల్ల... ముసలి ముతక... అన్ని వయసులవారు... వర్గాలవారూ... కథలు రాసి పంపచ్చు.

ఇతివృత్తం ఏదైనా వుండచ్చు! కానీ కథ చదివిన పాఠకుల గుండెను పిండేసేట్టుండాలి! కథాంశం చదువరులను శోకసంద్రంలో ముంచేయాలనేదే మా కోరిక! ఈ సూచన దృష్టిలో వుంచుకుని రచయిత(త్రు)లు వుత్తమోత్తమమైన ఉదాత్తమైన రచనచేసి పోటీకి పంపవలసిందిగా ప్రార్థిస్తున్నాం!

★ ★ ★ ★ ★

మా పోటీ ప్రకటనకు అత్యద్భుతమైన స్పందన రచయిత(త్రు)లనుండి వచ్చిందనటానికి కార్యాలయానికొచ్చిన కథల సంఖ్యే చెప్తుంది. భారతావనిలో గల సుదూర ప్రాంతాలనుండి మాత్రమే కాకుండా... విదేశాల్లో స్థిరపడిన తెలుగు వారినుండి కూడా కథలు అసంఖ్యాకంగా రావటం చూచి మా కళ్ళు ఆనందంతో మెరిసాయి.

పోటీకి మొత్తం వచ్చిన కథల సంఖ్య తొమ్మిది లక్షల తొంభై తొమ్మిదివేల తొమ్మిది వందల తొంభై తొమ్మిది (అనగా ఇది బాటా రేటుగా భావించవద్దు)

అనేకానేక వడపోతల పిదప లక్షా పాతికవేల కథలు చివరికి పోటీ బరిలో నిలిచాయి.

బస్తాలకొద్దీ కథలను మూటలకెత్తి తేలేక ఇబ్బంది పడటం చూచిన పత్రిక యాజమాన్యం ప్రత్యేకించి ఓ లారీని పోస్టల్‌వారికి అందుబాటులో మా ఖర్చుతో వుంచామని చెప్పటానికి ఎంతో సంతోషిస్తున్నాం.

సుమారు వెయ్యిమంది న్యాయ నిర్ణేతలను అసంఖ్యాకంగ వచ్చిన కథలను చదవటానికి ఆహ్వానించి వారిని స్టార్ హోటళ్లలో వుంచి అన్ని ఖర్చులూ భరించామని తెలియచేయటానికి ఆనందిస్తున్నాం.

పోటీకి వచ్చిన ప్రతి కథా మమ్మ న్యాయనిర్ణేతలను వెక్కి వెక్కి ఏడ్చేలా చేసింది. పరిశీలకులు కార్చిన కన్నీరు వరదలై పారి హుస్సేన్‌సాగర్ నీటిమట్టం పెరుగుదలకు ప్రబల కారణమైనదనేది కటిక వాస్తవం! మా పత్రిక కార్యాలయం సైతం మోకాళ్ళ లోతునీటిలో మునిగిన కారణాన నానా ఇబ్బందులు పడవలసి వచ్చింది.

కన్నీటి వరద రోడ్లపై ప్రవహించటం చూచిన పౌరులు... మంచినీటి పైపులు పగిలాయేమో అనే సందేహాన్ని వ్యక్తం చేశారు. వానేమైనా కురిసిందేమోనే భ్రమలో నగరవాసులు వుండిపోయారనటంలో అతిశయోక్తి ఎంతమాత్రమూ లేదని మనవి చేస్తున్నాం!

మా పత్రిక ఏ పోటీ తలపెట్టినా పాఠకులను కంటతడి పెట్టించక మానదనే విషయం మరొక్కసారి మనవి చేసుకుంటున్నాం! ఇలాంటి 'సెన్సేషనల్ ప్రోగ్రామ్స్' నిర్వహించటంలో మాకు మేమే సాటి అని మరోసారి తెలుపుకునే అవకాశం కలిగింది!

అసలు విషయానికొస్తే... మా పత్రిక నిర్వహించిన 'ఏడుపుగొట్టు' కథల పోటీలో ప్రథమ బహుమతి అయిదు లక్షల రూపాయలను కైవశం చేసుకున్న అదృష్టవంతురాలు రచయిత్రి శోకలక్ష్మిగారు.

వీరు ప్రస్తుతం సౌతాఫ్రికాలో వుద్యోగరీత్యా వుంటున్న తెలుగు వనిత! రచయిత్రి శోకలక్ష్మిగారు వ్రాసి పంపి ప్రథమ బహుమతి గెల్చుకున్న కథపేరు 'కన్నీరు... మున్నీరు...!'

వీరి కథ కేవలం ఎనిమిదిపేజీలే అయినా అంత చిన్న కథలో ఎన్నివందల వాటర్ టాంకుల కన్నీటిని ఇమిడ్చి రాశారో మాటల్లో చెప్పటం కష్టం!

ఈ కథను ఉత్తమమైనదిగా ఎన్నిక చేయటానికి ఎంతో కష్టపడవలసి వచ్చింది. శోకసంద్రంలో మునిగితేలిన సంపాదకవర్గం... న్యాయనిర్ణేతలు వారంరోజులపాటు

ఆకలి దప్పులకు దూరం కావలసి వచ్చిందనే కటిక వాస్తవం ఎవ్వరికీ నమ్మశక్యంగా వుండదు.

నూరవ జన్మదిన సంచికలో ప్రచురిస్తున్న ప్రథమ బహుమతి పొందిన 'కన్నీరు... మున్నీరు...!' కథ చదవబోయే ముందు పాఠకులు మేము సూచించే జాగ్రత్తలన్నీ తప్పక తీసుకోవలసిందిగా మనవి!

పాఠకుల గుండెను పిండివేయగల మహత్తు ఈ కథకు వున్నది. కథ చదివేక పాఠకదేవుళ్ళకు కలిగే ఆవేదనకు అసౌకర్యానికి... కట్టలు తెంచుకుని పొంగిపొరలి పారే కన్నీటి ప్రవాహానికి పత్రిక యాజమాన్యం బాధ్యత వహించదని తెలియచేసుకుంటున్నాం!

కథ చదవటానికి వుపక్రమించబోయే ముందుగా... రెండు పెద్దసైజు ఖాళీ బక్కెట్లు (బాల్చీలు) ఒక డజను టర్కీ టవల్స్ దగ్గరగ తమ అందుబాటులో వుంచుకోవలసిందిగా సూచిస్తున్నాం.

తీరా కథ చదివేక సొమ్మసిల్లిపడిపోవటం సంభవిస్తే... గ్లూకోజ్... హార్లిక్స్ వంటి ఉపశమనాన్ని కల్గించే పదార్థాలను రెడీగ దగ్గర వుంచుకోవటం పాఠకులు మరవకూడదు.

ఏడ్చి ఏడ్చిన కారణాన కళ్ళు ఎర్రబడటం... కనురెప్పలు వాయటం... గుడ్లు పీకటం వంటి సిమ్టమ్స్ కనిపిస్తే... ఐ కోల్డ్ లోషన్ నాలుగుబొట్లు రెండు గంటల కోమారు తప్పనిసరిగా వాడటం అత్యంత అవసరమని గమనించాలి!

అప్పటికీ ఉపశమనం కలగని ఎడల కంటివైద్యుని సంప్రదించి ట్రీట్‌మెంట్ తీసుకోవలసిందిగా మా విన్నపం.

మరొక ముఖ్యమైన విషయం!

కథ చదవటం పూర్తికాకమునుపే చేతిలో గల పత్రిక పాఠకుల కన్నీటిలో తడిసి ముద్ద అయితే (న్యూస్‌ప్రింట్ పేపరు వాడుతున్నాం కాబట్టి) మిగిలిపోయిన కథ చదవటానికి వీలుండకపోవచ్చు కనుక... ముందుగానే రెండు మూడు పత్రిక ప్రతులను కొని దగ్గర ఉంచుకోవల్సిందిగా కోరుతున్నాం! అవిధంగ ముందు జాగ్రత్త చర్య తీసుకుని ఒకటికంటే ఎక్కువ కాపీలు వుంచుకోని ఎడల కథ చదవటానికి అనుకోని అంతరాయం (టి.వీ. ప్రోగ్రామ్స్‌లో 'బ్రేక్'లా) కలిగి అసౌకర్యం పాలుకావటం పత్రిక అభిమతం కాదని తెలీచేస్తున్నాం.

ఇకపోతే... నట్టింట సోఫాలోనో... బెడ్‌రూమ్‌లో గల ఫోమ్ బెడ్‌మీదో కూర్చుని లేదూ పడుకుని కథ చదవకండి! దొడ్లోగల బాదంచెట్టు కిందో... మల్లె పందిరి కిందో (పరుపు, దిండు... దుప్పటి వగైరాల్లేకుండా) ఒక చెక్క స్టూలు మీద ప్రశాంతచిత్తులై అశీనులై... ప్రథమ బహుమతి పొందిన 'కన్నీరు... మున్నీరు' కథ చదవటం ఆరంభించండి!

మేమిస్తున్న ప్రాథమిక సూచనలను పాటించకుండా... యథేచ్ఛగ పాఠకుల ఇష్టానుసారం కథ చదివి ఇబ్బందులపాలు కాకండి!

కథాపఠనానంతరం... సున్నిత మనస్కులైన పాఠకులు (సినిమాలు... టి.వి. ప్రోగ్రామ్స్ చూస్తూ ఏడిచే వారెందరో వున్నారు గనుక) వెక్కి వెక్కి ఏడ్చి సొమ్మసిల్లి పోయినా... అధిక దుఃఖాన్ని తట్టుకోలేక హార్ట్ ఎటాక్ బారిన పడినా... అట్టి పాఠకుల ఆత్మశాంతి కోసం వారి అంత్యక్రియల ఖర్చు పత్రిక యాజమాన్యం భరిస్తుందని 'హామీ' ఇస్తున్నాం!

ఇంతటి ప్రాణాంతకమైన సెంటి'మెంటల్' సెన్సేషనల్ స్టోరీని పాఠకులకు అందిస్తున్నందుకు మాకెంతో గర్వంగ వుంది.

★ ★ ★ ★ ★

యావత్ ప్రపంచంలోని తెలుగు పాఠకులందరు 'గజిబిజి' శతజయంతి నాడు విడుదలైన మాసపత్రికను కొని చదివి అనేకులు అస్వస్థతకు గురై ఆస్పత్రుల పాలైనట్లు అన్ని భాషల్లో వెలువడే దినపత్రికలలోను... టి.వీల ద్వారాను ప్రసారం కావటం జరిగింది.

ఆస్పత్రి పాలైన వారిలో వ్యాధి లక్షణాలను డాక్టర్లు ఎన్నిరకాల పరీక్షలు జరిపినా కనుగొనలేకపోయారు.

ఆ వింత వ్యాధి బహుశ విదేశాలనుండి దిగుమతి అయివుండవచ్చుననే శంకతో అన్ని విమాన యాత్రయాల్లో వైద్య బృందాలను ఏర్పాటుచేసి విదేశీ స్వదేశీయులను ఏ ఒక్కరిని వదిలిపెట్టకుండా నెత్తురు పరీక్షలు నిర్వహిస్తూ అనుమానాస్పదులను అటునుంచి అటే ఆస్పత్రులకు తరలిస్తున్నారు.

వ్యాధి నిర్ధారణ కాక వైద్య విజ్ఞాన బృందాలు తలలు పట్టుకుంటున్నయ్.

ఎలక్ట్రానిక్ మీడియాల్లో బాధితుల గురించిన వార్తలనే పదేపదే టెలికాస్ట్ కాబడుతున్నయ్!

కొందరు పేషంట్ల కారణాలను విశ్లేషించి వివరంగ వైద్యులకుగానీ పోలీసులకు

గానీ చెప్పలేని నిస్సహాయ స్థితిలో వుండిపోయారు.

ఎడ్మిట్ అయిన పేషంట్లు... రోదిస్తూ గుండె బాదుకోవటం... భోరుభోరున విలపించటం... ఇంకా అనేకరకాల వింత వికృత చేష్టలు చేయటం చూస్తూ వైద్యులు నిస్సహాయస్థితిలో వుండిపోవలసిన దుస్థితి ఏర్పడింది.

ఈవిధంగ పలువురు బాధితులు అనూహ్యమైన వ్యాధి బారినపడి బాధపడుతున్న విషయం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి రావటంతో ఇలాంటి విచిత్ర సంఘటనలు జరగటానికి గల కారణాలు కనుగొని వెలికితీయాలను తీవ్ర ప్రయత్నం చేయనారంభించినయ్.

అన్నికోణాలనుండి పరిశీలించిన అనంతరం ఈ వ్యాధి పీడితులు 'గజిబిజి' మాసపత్రికలో బహుమతి పొందిన కథ 'కన్నీరు... మున్నీరు' చదివిన దరిమిలా ఆస్పత్రి పాలైనారనే నిజం వెలికితీసారు.

ఇంకేముంది అగ్గిరాజుకున్నట్టయింది. పత్రికను 'బేన్' చేయాలంటూ రాజకీయ ప్రత్యర్థి వర్గాలు గోలచేయనారంభించినయ్.

ఓ పత్రికలో బహుమతి వచ్చిన కథకి రాజకీయ రంగు పులిమారు.

ప్రతిపక్షాలు ధర్నాలు... దిష్టిబొమ్మ దహనాలు నిర్వహించినయ్.

అక్కసు తీరక చివరికి 'గజిబిజి' పత్రికాఫీసుమీద తెగబడి దాడిచేసి వస్తువులను కంప్యూటర్లను... విలువైన ఫర్నీచర్‌ను నాశనం చేశారు.

ఇలా జరుగుతుందని వూహించలేకపోయిన పత్రిక యాజమాన్యం లబోదిబోమంది.

జరిగిన నష్టానికి చింతించక... ఇకపై పత్రికలో ఈవిధమైన పోటీలనుగానీ... రచనలను గానీ ప్రోత్సహించరాదని తీర్మానించుకుంది యాజమాన్యం.

సంభవించిన దురదృష్ట సంఘటనకు 'గజిబిజి' యాజమాన్యం కన్నీరు... మున్నీరుగా విలపించారు. తమ పొరపాటుకి లెంపలేసుకున్నారు.

- సమాప్తం -